క్లుప్తంగా

వైభవంగా లక్ష రుద్రాక్ష అభిషేకం



రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మండలంలోని బేతపూడి గ్రామంలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం లక్ష రుద్రాక్ష పూర్వక ఏకాదశ రుద్ర సహిత నవనాగ సుబ్రహ్మణ్య హవనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష రుద్రాక్షలతో అభిషేకం, శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం మహానివేదన, హారతి మంత్రపుష్పం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకటప్పలాచార్యులు, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పక్కా గృహాలను తక్షణమే నిర్మించాలి

బాపట్లటౌన్: పేదలకు పక్కా గృహాలను తక్షణమే నిర్మించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జె.బి.శ్రీధర్ తెలిపారు. ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన పక్కా గృహాలు, నిరుపేదలకు నివేశన స్థలాల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని నిరుపేదలతో కలిసి వార్డు సచివాలయ సెక్రటరీకి వినతిపత్రాన్ని అందజేశారు. జె.బి.శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి తక్షణమే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఇసుక, ఇటుక, సిమెంటు, ముడి సరుకులను ప్రభుత్వమే అందించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్కా రామకృష్ణారెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ ముత్తిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సమస్యలు ఉంటే అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవచ్చన్నారు. వివిధ వార్డులలోని పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల, వీధి దీపాలు తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించబడునని పేర్కొన్నారు. పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

రేపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యం మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఆర్.విజయ్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పెనుమూడి, రేపల్లె పట్టణంలో నిర్వహించిన క్షేత్ర పర్యటనలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ పంటలో నమోదు చేసుకుని, ఈ కేవైసీ పూర్తి అయిన రైతులు తమ ధాన్యం విక్రయించుకోవచ్చన్నారు. సాధారణ రకం క్వింటా రూ.2,300, 75 కిలోల బస్తాకు రూ.1,725, 40 కిలోల బస్తాకు రూ.920 మద్దతు ధర అందించబడుతుందని తెలిపారు. గ్రేడ్‌–ఎ రకం క్వింటాకు రూ.2,320, 75 కిలోల బస్తాకు రూ.1,740, 40 కిలోల బస్తాకు రూ.928 మద్దతు ధర అందించబడుతుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ విద్యుత్ నిలిపివేత

వేమూరు: వేమూరు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ 33–11 కేవీలో కోడిపర్రు ఫీడర్ పరిధిలోని బలిజేపల్లి, వరహాపురం, బేతేళపురం, బూతుమల్లి, వ్యవసాయ విద్యుత్ లైన్ల మరమ్మతులకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

బాపట్లటౌన్: సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ పొందేందుకుగాను అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖాధికారి ఎస్.రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు డిగ్రీ మార్కుల లిస్ట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్, 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతపరిచి 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యాలయం కర్లపాలెం రోడ్డులోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ మొదటి అంతస్తులో ఉందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కనుమరుగవుతున్న కమ్మరి పనులు

- కొలిమి పనులు చేసే వారికి ఉపాధి కల్పించాలి
- ఇబ్బందులు పడుతున్న కమ్మరి పనులు చేసే కుటుంబాలు
- ప్రభుత్వం వారిని ఆదుకోవాలి



జంపనిలో చెట్టు కింద కొలిమిపై పనులు చేస్తున్న అల్లూరు సుబ్బారావు

వేమూరు: సాంకేతిక పరికరాలు వచ్చిన తరువాత చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల వారు అవస్తలు పడుతున్నారు. జీవన విధానానికి చేతి వృత్తిని ఆధారంగా భావించి చెట్టు కింద కొలిమి పనులతో జీవనం కొనసాగిస్తున్నారు. గతంలో ప్రతి గ్రామంలో పనులు చేసుకొని జీవనం కొనసాగించే వారు. గతంలో ప్రతి గ్రామంలో ఒక్క కొలిమి ఉండేది, వారు ఇంటి వద్దే పని ముట్లు చేసుకొని జీవనం కొనసాగించేవారు. ఇపుడు ఖార్ఖానా పనులు లేక మూసి వేయడంతో గ్రామాల్లో పని ముట్లు చేసే పనులు కనుమరుగయ్యాయి. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో అల్లూరు సుబ్బారావు చెట్టు కింద కొలిమి ఏర్పాటు చేసుకొని పనులు చేస్తున్నాడు. గతంలో దీని ద్వారా కోత కత్తులు తయారు చేసేవారు. సాన కొడవళ్లు, గొడ్డళ్లు కూడా తయారు చేసేవారు. వ్యవసాయంలో కొత్త కొత్త సాంకేతిక పరికరాలు వచ్చిన తరువాత చేతి వృత్తుల వారికి పనులు లేకుండా పోయాయి. డీజిల్ ఆయిల్ రంపం రావడంతో గొడ్డళ్లతో పని లేకుండా పోయింది. వ్యవసాయ యంత్రాలు రావడంతో కోత కొడవళ్ల తయారు చేయడం తగ్గింది.

+ ఇతర రాష్ట్రాలకు చెందిన వారు వలస వచ్చి గ్రామాల్లో గూడారాలు ఏర్పాటు చేసుకొని పని ముట్లను తయారు చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతంలో పనులు మూతపడ్డాయి. దానిపై ఆధారపడి జీవిస్తున్న వారు నానా అవస్తలు పడుతున్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాలను ఆదుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. కొలిమిపై తయారు చేసిన వస్తువులు చాలా నాణ్యతగా ఉండటం వల్ల రైతులు ఆ వస్తువులపై మొగ్గు చూపేవారు. సాంకేతిక యంత్రాల ద్వారా తయారు చేసిన వస్తువులు నాణ్యత పూర్తిగా లోపించడం జరుగుతందని గ్రామ ప్రజలు చెపుతున్నారు.

కమ్మరి పనులు చేసే వారిని ఆదుకోవాలి

గ్రామీణ ప్రాంతాల్లో కమ్మరి పనులు చేసే వారిని ప్రభుత్వం ఆదుకోవాలి. యంత్రాల వల్ల ఈ పనులు మూతపడ్డాయి. గ్రామాల్లో వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వాళ్లు లేక రైతులు అవస్తలు పడుతున్నారు.

– వేమూరు జక్రయ్య, వేమూరు



ప్రభుత్వం చేతి వృత్తుల వారిని ఆదుకోవాలి

చేతి వృత్తి పనులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చేతి వృత్తి పనులు చేసే వారికి పనులు కల్పించాలి. వారిని ప్రభుత్వం ఆదుకోవాలి.

– తాడి బోయిన అంకమ్మరావు, జంపని



పంట నమోదు చేయించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మి

దుండివారిపాలెం(కర్లపాలెం): రైతులందరూ తాము పండిస్తున్న పంటలను వ్యవసాయ శాఖ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దుండివారిపాలెం, యాజలి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతులు తమ పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర ఇస్తారని చెప్పారు. రైతులు ధాన్యాన్ని దళారులకు కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించాలని ఆమె అన్నారు. చిరు పొట్ట దశలో ఉన్న వరి పైర్లకు పొటాష్ వేయటం వలన గింజ గట్టిపడి దిగుబడి ఎక్కువ వస్తుందని చెప్పారు. వరి పంట కోతకు 45 రోజులు ముందు నుంచి ఎటువంటి పురుగు మందులు పిచికారీ చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, ఏఈవో ధనలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు సునీత, గోపి, రైతులు ఉన్నారు.

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాలి



మాట్లాడుతున్న వి.సుందర్‌రాజు

బాపట్లటౌన్: విద్యార్థులకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ముత్తాయపాలెం జిల్లా పరిషత్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వి.సుందర్‌రాజు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ముత్తాయిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. సుందర్‌రాజు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో పేద విద్యార్థులు ఎక్కువ మంది ఉన్నారని వారికి న్యాయం చేసే రీతిలో విద్యా బోధన చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ సెక్రటరీ గురజాల శ్రీనివాసరావు, సీఆర్పీ జాన్ వెస్లీ, శేషాద్రి శ్రీనివాస్ ముత్తయ్యపాలెం కాంప్లెక్స్, మరుప్రోలు వారిపాలెం కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అవలంబించాలి



మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: క్రమశిక్షణ, సత్ప్రవర్తన, ఉన్నత విలువలతో కూడిన జీవితాన్ని అవలంబించటం ద్వారా తమ గమ్యాలను సునాయాసంగా చేరుకోవచ్చని పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. కెరీర్ గైడెన్స్, సమాజంలో విద్యార్థుల పాత్రపై మండలంలోని పేటేరు జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. విద్యార్థి దశలో కచ్చితంగా సత్ప్రవర్తనతో మెలగాలని, చెడు సహవాసాలు చేయటంతో జీవితం శూన్యమవుతుందన్నారు. గంజాయి, సిగిరెట్‌లు వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని, అప్పుడే నాయకత్వ లక్షణాలు అలవడతాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికతో పాటు సమాజంలో విద్యార్థుల నడవడిక ఏ విధంగా ఉండాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాబూజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో ప్లాస్టిక్ సంపూర్ణ నిషేధం

- వారం రోజుల్లో దుకాణదారులు ప్రత్యామ్నాయం చూసుకోవాలి
- వారం తర్వాత ప్లాస్టిక్ కనిపిస్తే కఠిన చర్యలు
- మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి



దుకాణదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి

బాపట్లటౌన్: బాపట్ల పట్టణంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నిషేధిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం పట్టణంలోని కిరాణా, రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడతూ పట్టణంలో యథేచ్ఛగా వినియోగంలో ఉన్న ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధిస్తున్నామన్నారు. వారం రోజులు గడువు అనంతరం పట్టణంలో ఏ దుకాణంలో అయినా ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్టు సమాచారం వస్తే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంలో మీ వంతు సహకారం అందించాలన్నారు. పట్టణ ప్రజలు ప్లాస్టిక్ వాడకం నిషేధించి గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మోర్లవారిపాలెంలో మోంట్‌ఫోర్ట్ విద్యార్థుల క్షేత్ర పర్యటన




మోర్లవారిపాలెం సచివాలయ కేంద్రం వద్ద మోంట్‌ఫోర్ట్ స్కూలు విద్యార్థులు

రేపల్లె రూరల్: విద్యార్థి దశలో ప్రయోగాత్మకంగా విద్యను అభ్యసిస్తే ఆ అభ్యసన అంశాలు మనస్సులో జీవిత కాలం నిలుస్తాయని సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మండలంలోని మోర్లవారిపాలెం గ్రామంలో రేపల్లె పట్టణానికి చెందిన మోంట్‌ఫోర్ట్ స్కూలు విద్యార్థులు మంగళవారం నిర్వహించిన క్షేత్ర పర్యటనలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాఠ్యాంశంలోని అంశాలు నిజ జీవితాన్ని చూస్తూ అభ్యసిస్తే సమాజం గురించి తెలుసుకోవటం, ఏ విధంగా మసలు కోవాలో అవగాహన కలుగుతుందని చెప్పారు. క్షేత్ర పర్యటనలో విద్యార్థులు పంచాయతీ ఎన్నికల నిర్వహణ, గ్రామాల అభివృద్ధికి నిధుల ఏ విధంగా వస్తాయి, గ్రామ జనాభా, ఓటర్ల సంఖ్య, గ్రామీణుల స్థితిగతులు తదితర అంశాలపై అధికారులు, గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించారు. అనంతరం సచివాలయం పని చేసే విధానాన్ని ప్రత్యక్షంగా తిలకించి వారి విధులను, సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

తహసీల్దార్ ఎస్‌కే సలీమా



కొవ్వొత్తుల ర్యాలీలో తహసీల్దార్ సలీమా

బాపట్లటౌన్: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ షేక్ సలీమా తెలిపారు. జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులపై 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సలీమా మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకోవడం, పనికి పంపించడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో పురుషోత్తమరావు, బాలల సంరక్షణ అధికారి జి.కృష్ణ, సీడీపీవో పార్వతి, శిశుగృహ మేనేజర్ రోజలీనా, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్స్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే దత్తత తీసుకోవాలి

డీసీపీవో పురుషోత్తమరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీవో పురుషోత్తమరావు

బాపట్లటౌన్: చిన్న పిల్లలను దత్తత తీసుకునే వ్యక్తులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తీసుకోవాలని డీసీపీవో పురుషోత్తమరావు తెలిపారు. జిల్లా శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం దత్తత అవగాహన మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీపీవో పురుషోత్తమరావు మాట్లాడుతూ చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం, దత్తతకు కావలసిన విధివిధానాలను వివరించారు. దత్తత కావాల్సిన తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలన్నారు. అక్రమంగా దత్తత ఇవ్వడం తీసుకోవడం చట్టరీత్యా నేరం. అలా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి కృష్ణ, ఐసీడీఎస్ సీడీపీవో పార్వతి, శిశు గృహ మేనేజర్ రోజలీనా, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవరుచుకోవాలి



అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ముగ్గుల పోటీల్లో బాలికలు



యడ్లపల్లిలో మెహందీ పోటీల్లో మహిళలు, విద్యార్థులు



భట్టిప్రోలులో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు



మ్యూజికల్ చైర్ పోటీల్లో విద్యార్థులు



పుస్తకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం సత్యవతి

నగరం: ప్రతి ఒక్కరు పుస్తక పఠనం అలవరుచుకోవాలని గ్రంథాలయ ఉపాధ్యాయురాలు బి.రత్నకుమారి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి అనంతరం మాట్లాడారు. పుస్తక పఠనంతో మేధాశక్తిని పెంపొందించుకోవచ్చన్నారు. ఒక మంచి పుస్తకం ఒక మంచి స్నేహితునితో సమానమని విద్యార్థులకు సూచించారు. పాఠశాల సెలవు దినాలలో విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు జొన్న బ్రహ్మేంద్ర, ఉపాధ్యాయురాలు కే రాజ్యలక్ష్మి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలకు ముగ్గుల పోటీలు

అమర్తలూరు(వేమూరు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ తదితర పోటీలు, నిర్వహించడం జరిగిందని శాఖ గ్రంథాలయం ఇన్‌చార్జి శ్రీదేవి తెలిపారు. అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు ముగ్గులు పోటీలు, రన్నింగ్ రేస్ నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. పోటీలను ప్రధానోపాధ్యాయులు కె.నిరీక్షణరావు పర్యవేక్షించారు. వారోత్సవాలు ముగింపు రోజు బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. గిరిధర ప్రసాద్, ప్రసన్న, మాజేటి వెంకటేశ్వరరావు, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.

చుండూరు శాఖా గ్రంథాలయంలో...

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవం, మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. చుండూరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని గ్రంథాలయాధికారి భాగ్యలక్ష్మి తెలిపారు.

యడ్లపల్లి శాఖా గ్రంథాలయంలో...

చుండూరు మండలంలోని యడ్లపల్లి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరిగిందని గ్రంథాలయాధికారి బి.గిరిజ సుందరి తెలిపారు. గ్రంథాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. యడ్లపల్లి గ్రామంలోని మహిళలకు మెహందీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పతనంపై సదస్సు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని మాటూరు రామారావు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం తెలుగు భాష గొప్పతనం, మహిళా దినోత్సవంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు ఎంపీపీఎస్(ఎంబీఎస్) హెచ్‌ఎం ఎస్‌కే బాజీబాబు, ఉపాధ్యాయులు అనీఫ్ అలీలు తెలుగు భాష గొప్పతనం, మహిళా దినోత్సవం గురించి తెలియజేశారు. విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన 47 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

పుస్తక పఠనంతోనే మేధో శక్తి

బాపట్లటౌన్: పుస్తక పఠనంతోనే మేధోశక్తి పెంపొందుతుందని ఏవీవీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యవతి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఏవీవీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సత్యవతి మాట్లాడుతూ మహిళలు స్వయంగా ఎదగాలి అంటే తప్పనిసరిగా చదువు ముఖ్యమన్నారు. విద్యార్థినులు క్లాస్ పుస్తకాలతో పాటు గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవితంలో ఆర్థికంగా ఎదగడానికి పుస్తకాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కుటుంబంలో స్త్రీలు చదువుకుంటే ఆ కుటుంబం ఉన్నత స్థితికి వెళ్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శివాజీ గణేషన్, జి.వెంకటేశ్వరరావు, వెంకట్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, రైతు సంఘాల నాయకులు

బాపట్లటౌన్: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. మజుందార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 26న జరిగే ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సీఐటీయూ, కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులతో కలిసి మంగళవారం విడుదల చేశారు. మజుందార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాల్లో నవంబరు 26న దేశ వ్యాప్త నిరసనలు నిర్వహిస్తున్నాయన్నారు. దానిలో భాగంగా బాపట్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్మికులు, రైతులు పదేళ్ల క్రితం పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోర్కెను మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. మధ్యతరగతి ప్రజలు పన్నులు చెల్లించలేక పేదరికంలోకి జారుకుంటున్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయని, రైతులు, కార్మికులు మరింత పేదరికంలోకి నెట్టబడడానికి మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమన్నారు. ప్రపంచ కుబేరులుగా అదానీ, అంబానీలు ఎదగడానికి మోదీ ప్రభుత్వం నిస్సిగ్గుగా సహాయపడుతుందన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పరిశ్రమల్లో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించేందుకు ప్రత్యేక నిధిని కేటాయించాలన్నారు. కౌలు రైతులకు భూయజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పనిదినాలను కల్పించి రోజు వేతనం రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామారావు, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కె.సురేష్, కౌలు రైతు సంఘాల నాయకులు సీహెచ్.మణిలాల్, కె.శరత్‌బాబు, కె.ఝాన్సీ, జె.శ్యాముయ్యాల్ పాల్గొన్నారు.

ఆధార్ కార్డుల సవరణ చేయించాలి



కర్లపాలెం: విద్యార్థుల ఆధార్ కార్డులను అవసరం మేరకు సవరణ చేయించాలని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. ఎంఈవో మనోరంజనితో కలసి ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం గణపవరంలోని ఆధార్ సెంటర్‌ను సందర్శించారు. అలాగే పేరలి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థుల అపార్ నమోదు జరుగుతున్నందున కర్లపాలెం, ఎంవీరాజుపాలెం, పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఆధార్‌లో పేర్లు, చిరునామాలు, వయస్సు తేడాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా ఆధార్ సెంటర్‌లకు వెళ్లి సవరణ చేయించుకోవాలని చెప్పారు. అలాగే గిరిజనులు ఎవరికైనా ఆధార్ కార్డు లేకపోయినా సవరణలు అవసరమైనా తమకు అందుబాటులో ఉన్న ఆధార్ సెంటర్‌లలో నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అపర్ణ తదితరులు ఉన్నారు.